టెండర్లు లేవు...నిధులపై స్పష్టత లేదు!

ఆగమేఘాలపై రూ. 3446 కోట్ల హెచ్ సిటీ ప్రాజెక్టు పనులకు సీఎం శంకుస్థాపన

జీహెచ్ఎంసీ ఉద్యోగుల్లో విస్తృత చర్చ

సిటీబ్యూరో, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ఒక ప్రాజెక్టు ప్రతిపాదన కార్య రూపంలోకి రావాలంటే ముందుగా క్షేత్రస్థాయిలో పనుల సాధ్యాసాధ్యాలు, డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు, ఆ తర్వాత నిధులపై స్పష్టత, టెండర్ల ప్రక్రియను ముగించుకుని పనుల శంకుస్థాపన చేయాల్సి ఉంటుంది. కానీ ఘనత వహించిన కాంగ్రెస్ సర్కార్‌లో గుడ్డి దర్బార్‌లా టెండర్లు పిలవని ప్రాజెక్టుకు పనుల శంకుస్థాపన జరిగింది. కేబీఆర్ పార్కు చుట్టూ సిగ్నల్ ఫ్రీ రవాణా లక్ష్యంగా ప్రభుత్వం చర్యలకు సంకల్పించింది. రూ. 421 కోట్లతో ప్యాకేజీ -1లో జూబ్లీహిల్స్ చెక్ పోస్టు జంక్షన్, కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం, ముద్ద జంక్షన్, రూ.405 కోట్లతో ప్యాకేజీ-2లో జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు జంక్షన్, ఫిలింనగర్, మహారాజా అగ్రసేన్ , క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్లు సిగ్నల్ ఫ్రీ చేసేందుకుగానూ ప్రభుత్వం పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. హెచ్ సిటీ ప్రాజెక్టు కింద ఈ ప్రాజెక్టు చేపడుతున్నామని చెప్పిన ప్రభుత్వం నెలలు కావొస్తున్నా నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వలేదు. ఈ ఆర్థిక సంవత్సరం రెండు క్వార్టర్స్ ముగిసినప్పటికీ జీహెచ్ఎంసీ కేటాయించిన రూ. 3,075 కోట్ల బడ్జెట్‌లో కేవలం రూ. 250 కోట్లు మంజూరు చేసింది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం 3446 కోట్ల హెచ్ సిటీ ప్రాజెక్టు పనులకు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయడం విస్మయానికి గురిచేసింది. ఆగమేఘాల మీద ఈ పనులకు శంకుస్థాపన చేయాల్సిన అవసరం ఎంటీ? నిధుల మంజూరుపై స్పష్టత లేకుండా పనులు ఎ లా చేసేదిఅన్న చర్చ ఇంజినీర్లలో, ఉద్యోగుల్లో నెలకొనడం గమనార్హం.

హెచ్ సిటీ ప్రాజెక్టు పనులపై విస్తృత చర్చ..

కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు (గ్రేడ్ సపరేటర్స్) అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కేబీఆర్ పార్కు జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు, రోడ్ నం.45 జంక్షన్, ఫిలింనగర్ జంక్షన్, అగ్రసేన్ జంక్షన్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్ పనులకు గానూ రూ.1090 కోట్లు, రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు మల్టీ లెవల్ ఫ్లై ఓవర్, ఖాజాకుంట జంక్షన్, ఐఐఐటీ జంక్షన్, విప్రో జంక్షన్ పనులకు రూ. 837 కోట్లు, అమీన్‌పూర్ నుంచి ఎన్‌హెచ్ 65 రహదారి విస్తరణకు రూ. 45 కోట్లు, సైబరాబాద్ సీపీ కార్యాలయం నుంచి గచ్చిబౌలి జంక్షన్ వరకు రహదారి విస్తరణకు రూ. 39 కోట్లు, అంజయ్య నగర్ నుంచి రాంకీ టవర్ రోడ్ వరకు రహదారి విస్తరణకు రూ.31 కోట్లు, స్టీల్ గిడ్డర్ బ్రిడ్జి (పైపులైన్) నిర్మాణానికి రూ. 56 కోట్లు, ఆర్‌కేపురం ఆర్వో రూ. 210, ఆర్‌కే పురం ఆర్‌యూబీకి రూ.35 కోట్లు, చిలకలగూడ ఆర్‌యూబీ పనులకు రూ. 30 కోట్లు, ఒవైసీ ఫ్లై ఓవర్ నుంచి సంతోష్‌నగర్ ఫ్లై ఓవర్ ఎడమ వైపు డౌన్ ర్యాంపు, మైలార్‌దేవ్‌పల్లి, శంషాబాద్ రోడ్ నుంచి కాటేదాన్ జంక్షన్ వరదకు ఆరు లేన్ల బై డైవర్షనల్ గ్రేడ్ సపరేటర్‌కు రూ. 200కోట్లు, ఆరాంఘర్ జంక్షన్ ఆర్‌యుబీ రూ.59 కోట్లు, సోహెబ్ హోటల్ నుంచి బాలాపూర్ రోడ్ వరకు రహదారి విస్తరణకు రూ.9కోట్లు, లక్కీస్టార్ హోటల్ నుంచి హఫీజ్‌బాబా నగర్ వరకు రహదారి విస్తరణ పనులకు రూ. 57 కోట్లతో పనులు చేపట్టనున్నారు. వీటితో పాటు రూ.150 కోట్లతో సుందరీకరణ పనులు , రూ.17కోట్ల అంచనాలతో వరదనీటి నియంత్రణ చర్యలు చేపడుతున్నారు.

పలు అభివృద్ధి పనులు అందుబాటులోకి..

జలమండలి ఆధ్వర్యంలో రూ.669 కోట్లతో చేపట్టిన ఆరు ఎస్టీపీలను సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. వీటితో పాటు శివారులో ఓఆర్ఆర్ ఫేజ్ -2 కింద చేపట్టిన రూ.45 కోట్లతో 19 రిజర్వాయర్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. హెచ్‌ఆర్‌డీసీ ఆధ్వర్యంలో రూ.1500 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు.

నగరంలో అభివృద్ధి పనులు ప్రారంభం

వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సిటీబ్యూరో, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకొని హెచ్ఎండీఏ ఐమాక్స్ గ్రౌండ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని వివిధ అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... హైదరాబాద్‌ను న్యూయార్క్, టోక్యో నగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. సుమారు రూ.7వేల కోట్లతో భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించామని చెప్పారు. రాష్ట్ర ఖజానాకు 65 శాతం ఆదాయం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచే వస్తుందని సీఎం చెప్పారు. తెలంగాణకు మణిహారంగా 360 కిలోమీటర్లతో రీజినల్ రింగ్ రోడ్ నిర్మించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, అందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకువస్తున్నామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌ను గుర్తించి సంపుల నిర్మాణ పనులు చేపట్టామని, ఇప్పుడు రహదారులపై నీరు నిలువకుండా వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్స్ తీసుకొచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ మహా నగరం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. అంతకు ముందు సభా ప్రాంగణంలో వివిధ విభాగాల వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ముఖ్యమంత్రి, మంత్రులు సందర్శించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ సభ్యులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు, ప్రభుత్వ సలహాదారులు, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్ రెడ్డి, కార్పొరేటర్లు, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిరోధక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, తదితరులు

అవినీతి రహిత జిల్లాగా హైదరాబాద్

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ జిల్లాను అవినీతి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ అవినీతి నిరోధక శాఖకు సహకరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన అవినీతి నిరోధక వారోత్సవాల కరపత్రం, పోస్టర్, టోల్ ఫ్రీ నంబర్‌ను ఏసీబీ డీఎస్పీలతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అవినీతిని తరిమేసి దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్దామని అన్నారు. డిసెంబర్ 9 వరకు అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే ఇవ్వవద్దని, ఒత్తిడి చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా హైదరాబాద్ సిటీ ఏసీబీ ఫోన్ నంబర్ 9154388929, 9154388939లకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ కె. శ్రీనివాస్ రెడ్డి, జి. శ్రీధర్, ఇన్‌స్పెక్టర్లు పి. రఘునందన్, ఆర్. శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 3 : ఉద్యోగానికి వెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా లారీ ఢీకొని ఓ సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. ఈ సంఘటన కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ఏపీ, గుంటూరు జిల్లా బాపట్లకు చెందిన సాలేగ రమేశ్(43) 23 సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి... గాజులరామారంలో భార్యాపిల్లలతో కలిసి నివసిస్తూ... ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కాగా.. రోజు మాదిరిగానే ఈ నెల 2న రాత్రి గాజులరామారంలోని తన ఇంటి నుంచి బైక్‌పై డ్యూటీకి వెళ్లి... తిరిగి ఇంటికి బయలుదేరాడు. మంగళవారం ఉదయం 4 గంటల సమయంలో కేపీహెచ్‌బీ కాలనీలోని ఆల్మండ్ స్వీట్ హౌజ్ ఎదురుగా యూటర్న్ వద్దకు రాగానే గుర్తు తెలియని లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసుల దర్యాప్తులో వేగం పెంచండి

మేడ్చల్ జోన్ క్రైమ్ రివ్యూలో సీపీ అవినాష్ మహంతి

సిటీబ్యూరో, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. మేడ్చల్ జోన్ డీసీపీ కార్యాలయంలో క్రైమ్ రివ్యూ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. 174 పోక్సో, హత్యలు, స్నాచింగ్, మోసాలు, మహిళలు, పిల్లలు, తదితర కేసులకు సంబంధించిన పెండింగ్ కేసుల దర్యాప్తును వేగంగా పూర్తి చేయాలని సూచించారు. పెరుగుతున్న సైబర్‌నేరాలు, డిజిటల్ మోసాలను నిలువరించేందుకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని సూచించారు. నేరాల్లో సీసీటీవీ ఫుటేజీలను ఉపయోగించి నిందితులకు పక్కాగా శిక్షలు పడే విధంగా సాక్ష్యాలు కోర్టు ముందు ఉంచాలని సీపీ సూచించారు. ఎస్ఓటీ, సీసీఎస్‌కు సంబంధించిన కేసులను కూడా ఆయన పరిశీలించారు. డీసీపీలు కోటిరెడ్డి, కె.నర్సింహా, సృజన కర్ణమ్, శ్రీబాలదేవి, శ్రీనివాస్, అదనపు డీసీపీలు పురుషోత్తం, శోభన్‌కుమార్, ఫజుల్ రహమాన్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఎస్‌సీఆర్ఈఎస్‌ను గెలిపించండి

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తేతెలంగాణ): దక్షిణమధ్య రైల్వే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎస్‌సీఆర్ఈఎస్‌ను గెలిపించాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పిలుపునిచ్చారు. రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తమ యూనియన్ ముందుంటుందని పేర్కొన్నారు. యూనియన్ల గుర్తింపు కోసం ఈ నెల 4 నుంచి 6 వరకు బ్యాలెట్ ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ఈ ఎన్నికలు 17 జోనల్ రైల్వేలు, 2ప్రొడక్షన్ యూనిట్లలో నిర్వహిస్తారని తెలిపారు. సుమారు 78 వేల మంది రైల్వే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు.

గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేయాలి

హైదరాబాద్, డిసెంబర్ 3 (నమస్తేతెలంగాణ): ఈనెల 16 నుంచి 18వ తేదీల్లో ఒకేసారి ఆర్ఆర్‌బీ(జేఈ), గ్రూప్-2 పరీక్షలు ఉండటంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్ మూర్తి, కార్యదర్శి నాగరాజు, డీవైఎఫ్ఐ అధ్యక్షుడు కోట రమేశ్, ఆనగంటి కోటేశ్ అన్నారు. ఒకేరోజు రెండు పరీక్షల కారణంగా అభ్యర్థులు నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. ఈ క్రమంలో గ్రూప్-2 పరీక్షను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

భార్య మృతికి కారణమైన భర్తకు ఏడేండ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): భార్య కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన భర్త తొర్పునూరి లింగస్వామికి ఏడు సంవత్సరాల జైలుశిక్ష విధిస్తూ రంగారెడ్డి 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి కవిత తీర్పునిచ్చారు. అదనపు పీపీ వెంకటేశ్వర ప్రసాద్ కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్‌కు చెందిన నవీనకు అనాజ్‌పూర్‌కు చెందిన లింగస్వామితో వివాహమైంది. కొంతకాలం తర్వాత లింగస్వామి.. నిత్యం మద్యం సేవించి భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో 2018, ఆగస్టు29న లింగస్వామి మద్యం మత్తులో ఇంటికి వచ్చి గొడవపడడంతో విరక్తి చెందిన భార్య నవీన కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

వ్యాపారి దారుణ హత్య

అప్పుగా ఇచ్చిన డబ్బులు అడిగినందుకు ఘాతుకం

హయత్‌నగర్ డివిజన్‌లో ఘటన

కాశీరావు (ఫైల్)

హయత్‌నగర్, డిసెంబర్ 3 : తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని అడిగిన పాపానికి ఓ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అర్ధవీడు మండలం, దోనకొండ గ్రామానికి చెందిన యక్కలి కాశీరావు(37), భార్య సుమలత, ఇద్దరు పిల్లలతో కలిసి హయత్‌నగర్ డివిజన్‌లోని అరుూరి దయ కాలనీలో నివాసముంటున్నారు. కాశీరావు కార్లు క్రయ, విక్రయాలు చేస్తుంటాడు. వీరు నివాసముండే ఇంటి మొదటి అంతస్తులో రెండేళ్లుగా పెద్దగాని శేఖర్, పెద్దగాని సాయి, ఐతరాజు శంకర్‌లు అద్దెకు ఉంటున్నారు. వీరిలో సాయి, శంకర్‌లు హయత్‌నగర్‌లోని బొమ్మలగుడి వద్ద ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. పెద్దగాని శేఖర్.. కాశీరావుతో కలిసి కార్లు క్రయ, విక్రయాలు చేస్తున్నారు. అయితే.. కాశీరావు వద్ద శేఖర్ 2023, మేలో రూ. 3.60 లక్షలు, జూన్‌లో రూ.1.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య అప్పుడప్పుడు గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం శేఖర్ ఒక్కడే రూంలో ఉండగా కాశీరావు డబ్బులు అడగడానికి వెళ్లాడు. వారిద్దరి మధ్య గొడవ జరగడంతో శేఖర్.. కాశీరావును చంపేసి.. అతడి భార్య సుమలతకు చెప్పాడు. విషయం తెలుసుకున్న వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, హయత్‌నగర్ సీఐ నాగరాజు గౌడ్, సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినులకు లైంగిక వేధింపులు!

మదీనాగూడ శ్రీ చైతన్య కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ అసభ్యకర మెసేజ్‌లు..

ఫిర్యాదు చేసినా పట్టని యాజమాన్యం.. విద్యార్థి సంఘాల ఆందోళన

వివరాలు సేకరించిన మియాపూర్ పోలీసులు

కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

వైస్ ప్రిన్సిపాల్ శివ

కొండాపూర్/మియాపూర్, డిసెంబర్ 3 : ఓ వైపు సబ్జెక్ట్ ఒత్తిళ్లు.. మరో వైపు లెక్చరర్ల లైంగిక వేధింపులతో విద్యార్థులు అర్ధంతరంగా తనువులు చాలిస్తున్నప్పటికీ యాజమాన్యాలు కండ్లు తెరవడం లేదు. తమ కళాశాలలో ఏం జరుగుతుందో బయటి వ్యక్తులు వచ్చి ఆందోళనలు చేసే వరకు తెలుసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. శ్రీచైతన్య కళాశాలల్లో విద్యార్థినులపై ఉపాధ్యాయుల లైంగిక వేధింపుల ఘటనలు రోజుకు ఒకటి బయటకు వస్తున్నాయి. ఇదే వారంలో మదీనాగూడలోని శ్రీచైతన్య కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించగా, తాజాగా మదీనాగూడలోని భారతి భవన్ శ్రీచైతన్య కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ శివ విద్యార్థినులతో అసభ్యకరంగా స్నాప్‌చాట్‌లో చాటింగ్ చేసిన ఘటన చోటు చేసుకున్నది. భారతి భవన్‌లోని శ్రీచైతన్య డే స్కాలర్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శివ కొంత కాలంగా విద్యార్థినులకు స్నాప్‌చాట్‌లో రిక్వెస్ట్‌లు పంపిస్తూ, అసభ్యకరంగా మెసేజ్‌లు పంపిస్తున్నట్లు విద్యార్థినులు తెలిపారు. చాటింగ్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను సైతం కళాశాల యాజమాన్యంతో పాటు తల్లిదండ్రులకు అందించారు. ఇదిలా ఉండగా.. శివ మెసేజ్‌లకు రిప్లై ఇవ్వకపోతే విద్యార్థినులను అంత బిజీగా ఉన్నావా అంటూ అడిగి ఇబ్బందులకు గురి చేసేవాడని బాధితులు తెలిపారు. విద్యార్థినులకు ఎదురవుతున్న ఇబ్బందులపై తల్లిదండ్రులతో కలిసి యాజమాన్యానికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదంటూ వాపోతున్నారు. విషయం విద్యార్థి సంఘాలకు తెలియడంతో మంగళవారం పలు విద్యార్థి సంఘాలు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టాయి. వైస్ ప్రిన్సిపాల్ శివను వెంటనే ఉద్యోగంలో నుంచి తీసివేసి, అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా శివను 5 రోజుల క్రితమే వైస్ ప్రిన్సిపాల్ విధుల నుంచి తొలగించామని చెబుతుండగా, నిన్నటి వరకు శివ కాలేజీకి వచ్చాడంటూ విద్యార్థులు తెలిపారు. కళాశాల ఎదుట జరుగుతున్న ఆందోళన సమాచారాన్ని అందుకున్న మియాపూర్ పోలీసులు అక్కడికి చేరుకుని జరిగిన విషయాన్ని తెలుసుకుని, వైస్ ప్రిన్సిపాల్ వేధింపులపై విద్యార్థినులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థి సంఘాలు, విద్యార్థినుల స్టేట్‌మెంట్‌తో పోలీసులు ఫిర్యాదును స్వీకరించారు.

మళ్లీ పెరుగుతున్న పాత తరహా సైబర్‌నేరాలు!

సిటీబ్యూరో, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాల్లో పాత, కొత్త తరహా నేరాలకు సంబంధం లేకుండా నేరస్థులు రెచ్చిపోతున్నారు. ప్రజల్లో విస్తృతమైన అవగాహన రావడంతో పాత తరహా మోసాలు తగ్గాయంటూ సైబర్ పోలీసులు చెబుతున్నా.. పూర్తి స్థాయిలో మాత్రం ఆయా నేరాలు తగ్గడం లేదు. గతంలో ఇన్సూరెన్స్, లోను, ఓఎల్ఎక్స్, ఉద్యోగాలంటూ మోసాలకు పాల్పడుతూ వచ్చారు. ఆ తరువాత లోన్‌యాప్, కలర్ ప్రిడిక్షన్, ఇన్వెస్ట్‌మెంట్, పార్ట్‌టైమ్, డిజిటల్ అరెస్ట్‌లంటూ భారీ మోసాలకు తెగబడుతున్నారు. అయితే పాతతరహా మోసాలపై ప్రజల్లో అవగాహన రావడంతో అవి కొన్నాళ్లు తగ్గుముఖం పట్టాయి. రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా, యూపీ, బెంగాల్.. ఇలా పలు రాష్ట్రాల్లోని సైబర్‌నేరగాళ్లను గతంలో అరెస్ట్ చేయడంతో నేరగాళ్లు తమ నేరాలను తగ్గుముఖం పట్టించారు. ఇంతలో ఇదే సైబర్ నేరగాళ్లలో కొందరు విదేశీయులతో చేతులు కలిపి విదేశాల నుంచి తమ దందాలు నిర్వహిస్తూ భారీ మోసాలకు తెరలేపారు. దీంతో పాత తరహా మోసాలు తక్కువ మొత్తంలో జరిగే ఆర్థిక నష్టానికి సంబంధించిన కేసులు తగ్గుముఖం పట్టాయి.

అయితే.. తిరిగి సైబర్ నేరగాళ్లలోకి కొత్తవారు వస్తుండడంతో పాతతరహా మోసాలు ఇటీవల పెరుగుతూ వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఎదో పనిచేస్తామంటూ నమ్మించి దానికి డబ్బులు కట్టాలంటూ పాన్, ఆధార్, బ్యాంకు ఖాతాలు తీసుకోవడం, లింక్‌లు పంపించడం చేస్తే అది మోసమని గుర్తించాలని పోలీసులు చెబుతున్నారు. డబ్బు ప్రస్తావన వచ్చిందంటే దానిని అనుమానించాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఇంట్లో చోరీ.. నిందితుల అరెస్టు

బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం

వివరాలను వెల్లడిస్తున్న బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్

జీడిమెట్ల, డిసెంబర్ 3 : కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ జోన్ డీసీపీ సురేశ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. కూకట్‌పల్లి జయనగర్‌లోని శ్రీ సాయిత ప్యాలెస్‌లో నివాసం ఉంటున్న కె.మధుసూదన్‌రావు నవంబర్ 28న ఫ్లాట్‌కు తాళం వేసి కూతురు ఇంటికి వెళ్లి.. తిరిగి 29న ఉదయం రాగా ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులు సంపంగి లక్ష్మణ్, గుమ్మడి నాగశంకర్, గుమ్మడి మురళిలను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. నిందితుల నుంచి బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో క్రైమ్ డీసీపీ నర్సింహా, ఏసీపీ సురేశ్‌కుమార్, కూకట్‌పల్లి సీఐ ముత్తు, డీఐ వెంకటేశం, సీసీఎస్ బాలానగర్ ఇన్‌స్పెక్టర్ రాజు, కూకట్‌పల్లి ఎస్ఐలు సతీశ్‌రెడ్డి, గిరిశ్, తదితరులు ఉన్నారు.

హైడ్రాకు రూ.50కోట్లు విడుదల

సిటీబ్యూరో, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): రాష్ట్రప్రభుత్వం హైడ్రాకు నిధులు విడుదల చేసింది. నగరంలో ప్రభుత్వ స్థలాలు, పార్కుల పరిరక్షణ, చెరువుల పునరుద్ధరణ, విపత్తు నిర్వహణ కోసం పనిచేస్తున్న హైడ్రాకు రూ.50కోట్లను విడుదల చేస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. హైడ్రా కార్యాలయ నిర్వహణ, కొత్తవాహనాల కొనుగోలుతోపాటు ఇప్పటివరకు కూల్చివేతలకు సంబంధించిన బిల్లులు చెల్లించేందుకు ఈ నిధులు ఖర్చు చేసుకోవచ్చని ఉత్తర్వులో పేర్కొన్నారు. బడ్జెట్‌లో హైడ్రాకు రూ.200కోట్లు కేటాయించిన ప్రభుత్వం తాజాగా రూ.50 కోట్లు విడుదల చేసింది. హైడ్రా కూల్చివేతల సమయంలో ఉపయోగించిన వాహనాలతోపాటు మరికొన్ని పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కార్యాలయ ఖర్చులు, కూల్చివేతల ఖర్చులు తడిసి మోపెడవడంతో గత కొన్ని నెలలుగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ తమకు నిధులు విడుదల చేయాలని పలుమార్లు కోరారు. చివరకు పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి నిధులు విడుదల చేయడంతో కొంత రిలీఫ్ అయ్యారు. హైడ్రా మరో నాలుగు వాహనాలను కొనుగోలు చేయనున్నదని తెలిసింది. కూల్చివేతలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా క్లియర్ చేసే ప్రయత్నంలో ఉన్నట్లు తెలిసింది.

చెరువుల సుందరీకరణ వేగవంతం

హైడ్రా ఆధ్వర్యంలో చెరువుల సుందరీకరణను వేగవంతం చేయడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి విడుదల చేయాలని కమిషనర్ రంగనాథ్ ప్రభుత్వాన్ని కోరారు. అయితే మొదట హైడ్రా ఖర్చుల కోసం విడుదల చేసిన రూ.50 కోట్ల నుంచి కొన్ని నిధులను చెరువుల సుందరీకరణపై పెట్టాలని, అందులో భాగంగా బతుకమ్మకుంట, తౌటోనికుంట, తార్నాకలోని ఎర్రగుంటలను మొదట క్లియర్ చేసి ఈ చెరువులను సుందరీకరించనున్నామని హైడ్రా అధికారి ఒకరు చెప్పారు.

మ్యాప్ ద్వారా ఆక్రమణల తొలగింపు

జియోస్మార్ట్ సదస్సులో హైడ్రాకమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, డిసెంబర్ 3(నమస్తే తెలంగాణ): శాటిలైట్ మ్యాప్ డేటాబేస్ ద్వారా చెరువులను గుర్తించి.. వాటిని హైడ్రా కాపాడుతుందని, మ్యాప్ ద్వారా ఆక్రమణలను గుర్తించి తొలగిస్తున్నామని మైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ కోసం కొందరు ఇబ్బందిపడినా కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నామని అన్నారు. మంగళవారం హైదరాబాద్ హైటెక్స్‌లో జరిగిన జియోస్మార్ట్– 2024 సదస్సులో సాంకేతిక పరిజ్ఞానంతో విపత్తు నిర్వహణ, వాతావరణ మార్పులపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రసంగించారు. నగరంలో వరదముప్పును అధిగమించడానికి సాంకేతికంగా పలు రకాల ప్రణాళికలు తయారు చేస్త